అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 02 జులై 2023

7వ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ



నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ఆహార భద్రత కార్డులలో పేరున్న ఒక వ్యక్తికి ఆరు కిలోల చొప్పు బియ్యంను ప్రభుత్వం ఉచితంగా జూలై నెలలో 7 వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్టు జిల్లా సివిల్ పస్లయ్ అధికారిని పద్మ శనివారం తెలిపారు. రేషన్ డీలర్లు బియ్యం అర్హత గల లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేయాలని సూచించారు. లబ్ధిదారులందరూ బియ్యం తీసుకోవాలని సూచించారు.

బాబ్లీ గేట్లు ఎత్తివేత



నవతెలంగాణ-మెండోరా

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు శనివారం తెరుచుకున్నాయి. సుప్రీం తీర్పు ప్రకారం.. ప్రతేడాదీ వర్షాకాలం ప్రారంభం జులై 1వ తేదీన గేట్లు తెరిచి అక్టోబర్ 28వ తేదీనా మూసివేయనున్నారు. మహారాష్ట్ర , తెలంగాణ రాష్ట్ర జల వనరుల అధికారుల సమక్షంలో సిడబ్ల్యుసి ఈఈ వెంకటేశ్వర్లు , సిడబ్ల్యుసి ఎస్ డిఈ ప్రజీత్ , బాబ్లీ ప్రాజెక్టు ఈఈ బన్సోడ్ , బాబ్లీ డిఈఈ ఆర్.ఆర్ పోట్ దార్ , ఎస్సారెస్పీ ఈఈ యం.చక్రపాణి , ఎఈఈ యం.వంశి లు బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

గ్రూప్-4 పరీక్ష ప్రశాంతం

- ఒరిజినల్ ధ్రువపత్రాలు లేక పరీక్ష రాయలేకపోయిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ





భిక్కనూర్: ఉరుకులు.. పరుగులు. నిజామాబాద్‌సిటీ : నెంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు.. ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలు లేక పరీక్ష రాయలేకపోయిన అభ్యర్థులు..

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్‌సీ) ద్వారా శనివారం జరిగిన గ్రూప్-4 పరీక్ష నిజామాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 39174 మంది అభ్యర్థులకు గాను ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగిన మొదటి సెషన్ పేపర్-1 పరీక్షకు 32,342 మంది (82.55 శాతం) హాజరు కాగా, తిరిగి మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించిన పేపర్-2కు 32,255 మంది (82.34 శాతం) హాజరైనట్టు అధికారులు తెలిపారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 40 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-4 పరీక్షలు నిర్వహించారు. 16,101 మంది అభ్యర్థులకు గాను 13,988 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 2,113 మంది అభ్యర్థులు గైరాజరయ్యారు. 86.88 శాతం అభ్యర్థులు పరీక్ష హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ ఆయా రూట్ల వారీగా ప్రశ్న పత్రాలు, ఇతర సామాగ్రిని ఆయా పరీక్షా కేంద్రాలకు తరలించారు. టీ ఎస్ పీ ఎస్ సి నిబంధనలను అనుసరిస్తూ నిర్ణీత సమయానికి 15 నిమిషాల ముందు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేశారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుండి పరీక్షా సమయాలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ ను అమలు చేస్తూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష ముగిసిన అనంతరం అభ్యర్థుల ఓ.ఎం.ఆర్ షీట్లు, ఇతర సామాగ్రిని నిబంధనలకు అనుగుణంగా సీల్ వేసి పోలీస్ ఎస్కార్ట్ నడుమ స్ట్రాంగ్ రూమ్ కు తరలించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ చేసిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని శ్రీ నూతన వైశ్య ఉన్నత పాఠశాల, కాకతీయ జూనియర్ కాలేజ్‌లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ గూపన్ పల్లిలో గల శ్రీ చైతన్య హైస్కూల్ లోని ఎగ్జామ్ సెంటర్ ను సందర్శించారు. అభ్యర్థుల హాజరు గురించి పరీక్షా కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎగ్జామ్ హాల్లోకి క్యాలిక్యులేటర్, సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెయిన్ గేట్ ల వద్దే క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. జిల్లాలో సగటున 82 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు.

ఒరిజినల్ గుర్తింపు కార్డులు లేక వెనుదిరిగిన పలువురు

ఏదైనా ఒక ప్రభుత్వ గుర్తింపు కార్డును పరిశీలించిన తర్వాతనే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి తరలించారు. అయితే పలువురు ఒరిజినల్ కార్డులు తెచ్చుకోకపోవడంతో పరీక్ష రాయలేకపోయారు. తమకు అనుమతి ఇవ్వాలని వేడుకుంటూ గేటు వద్దే పడిగాపులు కాసి తిరిగి వెళ్లిపోయారు. అభ్యర్థుల సౌకర్యార్థం సెంటర్‌ల వద్ద సెల్‌ఫోన్‌లు, బ్యాగులు భద్రపరిచేందుకు లాకర్‌లను ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించిన సీపీ

కంఠేశ్వర్ : నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలో నిజామాబాద్‌లో (78), ఆర్మూర్ లో (25), బోధన్ లో (22) నిర్వహిస్తున్న మొత్తం 125 కేంద్రాల్లో గ్రూప్ 4 పరీక్షను ఏర్పాటు చేయగా వాటిని శనివారం నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సి.హెచ్.ప్రవీణ్ కుమార్, ఐ.పి.యస్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాలను పోలీస్ కమిషనర్ పరిశీలించి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును అదనపు డీసీపీ, ముగ్గురు ఏసీపీలు, 19 మంది సీఐలు, ఆర్ఐలు, 48 మంది ఎస్ఐలు, 64 మంది ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్స్, 140 మంది కానిస్టేబుల్లు, హోం గార్డులు, 83 మంది మహిళా సిబ్బంది, 48 మంది ఇతర విభాగాల సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు.

సదాశివనగర్ మండలంలోని స్ప్రింగ్‌ఫీల్డ్ స్కూల్‌లో నిర్వహించిన పరీక్ష కేంద్రం వద్ద సీఐ రామన్, ఎస్ఐ రాజేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు. తాడ్వాయి మండల కేంద్రంలో గ్రూప్ 4 పరీక్షలకు ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాస్ బందోబస్తు పర్యవేక్షించారు.

భిక్కనూర్ : భిక్కనూర్ మండలంలో భిక్కనూరు పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాలలో, బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్, మహాత్మ జ్యోతిబాపూలేలో గ్రూప్ 4 పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పరీక్ష రాస్తున్న విద్యార్థుల కొరకు వైద్య సిబ్బంది పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేశారు. విజ్ఞాన్ పాఠశాలలో 360 మంది విద్యార్థులు గ్రూప్ 4 పరీక్ష రాయగా, 295 మంది విద్యార్థులు హాజరయ్యారు, మిగతా 5 హాజరైనట్లు పరీక్ష కేంద్ర నిర్వాహకులు తెలిపారు.




పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్, సీపీ.





తల్లీ పరీక్ష రాస్తుండగా.. బాబును ఎత్తుకున్న తండ్రి.. రోడ్డు పక్కన వాహనాల బారులు



చినుక జాడ లేక.. చిన్నబోతున్న నేల

- వరుణుడి కోసం రైతుల ఎదురుచూపులు

నవతెలంగాణ-జుక్కల్

'సినుకమ్మ.. వాన సినుకమ్మ.. నేల చిన్నబోయే సూడు బతుకమ్మ.. మేఘాల దాగుండి పోకమ్మ.. ఆగ మేఘాల మీదను రావమ్మ కంటి మీద కునుకు లేదమ్మ.. పల్లె కన్నీరు బెడుతుంది సూడమ్మ.. కరుణించి ఓసారి రావమ్మ.. మా కష్టాలెన్నో తీరునోయమ్మా..' వర్షం రాక కోసం ఓ సినీ గేయ రచయిత రాసిన పాట అందరి నోళ్లల్లో మెదులుతుంది. ప్రస్తుతం రైతులు సైతం వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మృగశిర కార్తి ముగిసి ఆరిద్ర కార్తీలోకి ప్రవేశించి వారం రోజులు గడిచినా వాన జాడ లేక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు, ఎరువులు, దుక్కిదున్ని విత్తుకునెందుకు భూమి సిద్ధం చేసినా నాటి నుండి వరణుడు కరుణించక పోవడం, అడపాదడపా పడిన వర్షం భూమికి నీరు సరిపోక పోవడంతో ఆకాశం వైపు దీనంగా చూస్తున్నాడు. ఆకాశం మేఘామృతమవుతున్నా.. చినుక రాలకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు.

వర్షం కోసం జుక్కల్ మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలోని విగ్రహాలకు రైతులు శనివారం జలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నారు.



వర్షాలు కురవాలని జలాభిషేకం చేస్తున్న నాగల్‌గావ్ రైతులు

న్యాయవాద వృత్తి ఉన్నతమైనది

- ఆ గొప్పదనాన్ని కాపాడుకోవాలి
- జిల్లా జడ్జి సునీత కుంచాల



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత న్యాయవ్యవస్థలో మేధోసంపత్తి కలిగిన న్యాయవాదులకు కొదువలేదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. న్యాయవ్యవస్థతో పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో ఎందరో మహానుభావులు దేశ ప్రగతి నిర్మాణానికి పునాదులు వేసిన న్యాయవాదులు ఉన్నారని తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో "న్యాయవాద వృత్తి, వృత్తి పరమైన నీతి" అనే అంశంపై నిర్వహించిన సెమినార్ లో ఆమె న్యాయవాదులను ఉద్దేశించి ప్రసంగించారు. చట్టాలను నిరంతర అధ్యయనం చేయాలని నూతన చట్టాలను తెలుసుకోవాలని ఆమె అన్నారు. జూనియర్ న్యాయవాదులు తమ సీనియర్ న్యాయవాదుల వద్ద ఎన్నో చట్టసంబంధిత విషయ పరిజ్ఞానం నేర్చుకోవాలని సూచించారు. న్యాయస్థానాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో వృత్తి పరమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆంగ్లంలో అనర్గళమైన పరిజ్ఞానం, బాషపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. వృత్తిలోని గొప్పతనాన్ని కాపాడుకోవాలని ఉద్బోదించారు. జూనియర్ న్యాయవాదులు సీనియర్లను గౌరవప్రదంగా చూసుకోవాలని అన్నారు. ప్రతి న్యాయవాది జిల్లాజడ్జి అని తెలిపారు. న్యాయవాద వృత్తి నుండి దేశ ప్రధాన మంత్రులు, మంత్రులు, రాష్ట్రల ముఖ్యమంత్రులు అయిన చరిత్ర ఉన్నదని తెలిపారు. స్వతంత్ర న్యాయవ్యవస్థలోని ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తులు దేశానికి వెలుగురేకులుగా నిలుస్తు ప్రజాస్వామ్య సౌధానికి ఒక ప్రధాన రక్షకులుగా నిలుస్తున్న వర్తమాన చరిత్ర మనముందు ఉన్నదని వివరించారు. బార్ అధ్యక్షుడు దేవదాస్, ప్రధాన కార్యదర్శి భాగి చరణ్ ప్రసంగిస్తూ ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులకు న్యాయ సంబంధిత విషయ పరిజ్ఞానాన్ని విస్తృతం చేయాలనే సంకల్పంతో సెమినార్‌కు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

ప్రోటోకాల్ పాటించని స్థానిక అధికారులు

పోడు పట్టాల పంపిణీ పోస్టర్‌లో జడ్పీ చైర్మన్ ఫొటో విస్మరణ

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలో స్థానిక రైతు వేదికలో జరిగిన పోడు పట్టాల పంపిణీల కార్యక్రమంలో సభ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జిల్లా పరిషత్ చైర్మన్ ఫొటోను అధికారులు విస్మరించడం వివాదానికి దారి తీసింది. ప్రోటోకాల్ ప్రకారం.. క్యాబినేట్ ర్యాంకు ఉన్న జిల్లా పరిషత్ చైర్మన్ ఫోటో పెట్టాల్సి ఉన్నా మండలాధికారులు విస్మరించారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నియోజకవర్గాల్లో ఎక్కడ కూడా ఆయనకు సరైన ప్రాముఖ్యత ఇవ్వడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక నాయకుల ఒత్తిడితో ఫొటో తొలగించారో.. లేకుంటే పొరపాటుతో ఫొటో తీసుకోలేదో అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదంపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.



జడ్పీ చైర్మన్ ఫొటో లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకు

3న చలో కలెక్టరేట్..

- గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి
- ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.15 లక్షలు అందించే వరకూ పోరాటం
- ప్రజా సంఘాల పోరాట వేదిక పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యల పరిష్కారం కోసం 3వ తేదీనా(సోమవారం) కలెక్టరేట్ వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల పోరాట వేదిక పిలుపునిచ్చింది. ఇండ్లు లేని పేదలు వేలాదిగా తరలివచ్చి ధర్నాల్లో పాల్గొనాలని, తమ గొంతు వినిపించాలని నాయకులు కోరారు. శనివారం నిజామాబాద్ జిల్లాలో సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు నూర్జహాన్, పెద్ది వెంకట్రాములు, పి వెంకటేష్, పెద్ది సూరి, సుజాత, అనిల్, కొండ గంగాధర్ మాట్లాడారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తుంటే కొన్ని కేంద్రాల్లో పోలీసులు, రెవిన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, రియల్ ఎస్టేట్ కబ్జాదారులతో కుమ్మక్కై పేదల మీద దాడులు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడం కోసం, సమస్య పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా గుడిసె వాసులపై నిర్బంధం ఆపాలనీ, కేసులు రద్దు చేయాలనీ, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకున్న వారందరికీ 125 గజాల చొప్పున పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం నిబంధనలు సవరించి సొంత ప్లాటు ఉన్న పేదలందరికీ వర్తింపజేయాలని కోరారు. సమస్యలను పరిష్కారం చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శంకర్ గౌడ్, ఏషాల గంగాధర్, అనిత, జంగం గంగాధర్ పుష్పలింగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- డీఈఓకి సమ్మె నోటీసు అందజేసిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ యూనియన్ నాయకులు



డీఈవో కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం 3000 రూపాయలను చెల్లిస్తామని ప్రకటించిన హామీ అమలు కాలేదని, జిల్లాలో 8 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10,11,12 తేదీల్లో టోకెన్ సమ్మె చేపట్టనున్నట్టు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ తెలిపారు. యూని యన్ (సిఐటియు) జిల్లా కమిటీ సమావేశం నాందేవ్ వాడలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10 11 12 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా టోకెన్ సమ్మెను నిర్వహించనున్నట్టు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో సమ్మె జయప్రదం కోసం సమ్మె నోటీసును డిఇఓ కి యూనియన్ ప్రతినిధులు అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజన కార్మికులకు 3000 రూపాయలను చెల్లిస్తామని ప్రకటించిన హామీ అమలు కాలేదని, జిల్లాలో 8 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయని, కొత్త మెనూ అమలు పేరుతో హెడ్మాస్టర్లు మధ్యాహ్న భోజన కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు, మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పి మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధిని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతుందని ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10, 11, 12 తేదీలలో నిర్వహించే టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గంగాధర్, జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి, నాయకులు సురేందర్ రెడ్డి, సుజాత, నిరంజన, స్వప్న, పర్వమ్మ, శేఖర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో రేడియాలజీ పరికరాల ఆవిష్కరణ



రేడియాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో టీహబ్ రేడియా లజీకి సంబంధించిన పరికరాల ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆన్‌లైన్‌లో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ లో నిర్వహిస్తున్న 57 రకాల రక్త మూత్ర, ఇతర పరీక్షలను 134కు పెంచినట్లు తెలిపారు.టి హబ్ రేడియాలజీ పరికరాలు ద్వారా ప్రజలకు మెరుగైన చికిత్స అందజేయాలని తెలిపారు. జులై 1 డాక్టర్ డే ను పురస్కరించుకొని జిల్లా పరిషత్ చైర్మన్ చేతుల మీదుగా రేడియాలజీ విభాగానికి చెందిన మామోగ్రాఫ్ పరికరము ప్రారంభించి రక్త పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించినట్టు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ ప్రతిమ రాజ్ తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అధునాతనమైన పరికరములు అన్ని రకముల మౌలిక వసతులు కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిర ప్రిన్సిపల్ వైద్య కళాశాల నిజామాబాద్, డాక్టర్ సుదర్శనం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, శ్రీనివాస్ నిజామాబాద్ జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు, సంతోష్ కుమార్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిజామాబాద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
ఆదివారం 02 జులై 2023

40 రోజులుగా నిరసన చేస్తున్నా పట్టించుకోరా..?

- యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తాము సమస్యలు పరిష్కరించాలని 40 రోజులుగా నిరసన చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని తెలంగాణ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు మండిపడ్డారు. శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డానియల్, నాగేంద్రబాబు, సునీత, జోష్న, సీత, డాక్టర్ రాజేశ్వరి, సిహెచ్ శ్రీనివాస్, రామేశ్వర్‌రెడ్డి, సురేష్, గోపిరాజ్, అపర్ణ, సందీప్, ఆనంద్, నర్సింలు, శ్వేత, ఈ కామర్స్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ పట్టాలివ్వాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ డివిజన్ పరిధిలోని రూరల్‌లోని డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, మోపాల్, మాక్లూర్ మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో పోడు భూముల కోసం దరఖాస్తులు చేసుకున్న వారందరికీ పట్టాలివ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సాయగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దండు గంగమల్లు, వాసవి మోహన్, నారాయణ, గంట రాజేందర్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల వ్యతిరేకి.. బీజేపీ

- సీఎం చొరవతో గిరిజనులకు లబ్ది
- రాని వారు ఆందోళన చెందొద్దు
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీజేపీ.. గిరిజనుల వ్యతిరేకి అని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. రూరల్ నియోజవకర్గంలో అత్యధికంగా అటవీ ప్రాంతం ఉందని, గిరిజన తండాలు అధికంగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ చొరవ, శ్రద్ధ వల్ల ఈ నియోజకవర్గం నుంచి అత్యధిక మంది గిరిజన బిడ్డలకు మేలు జరుగుతున్నదని, వారంతా పట్టాదారులవుతున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ, గిరిజనులకు, ఆదివాసులకు మేలు చేయాలనే తపన, కృషి వల్ల ఎన్నో ఏండ్లనాటి గిరిజనుల కల నెరవేరిందని పేర్కొన్నారు. శనివారం ఇందల్‌వాయి మండలంలోని అన్సన్‌పల్లి చౌరస్తా పెద్దమ్మ గుడి వద్ద ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో పోడు భూముల పట్టాలను ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి గంగాధర్ గౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో మొత్తం 1623 మంది గిరిజన బిడ్డలకు మేలు జరుగుతుందని, మొత్తం మూడు వేల ఎకరాలకు పోడు పట్టాలను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు సాగు చేసుకుంటూ ఆక్రమణలో ఉన్న వారందరికీ అటవీ చట్టాన్ని అనుసరించి, అటవీ హక్కుల మేరకు పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని, సీఎం కృషి వల్లే ఇది సాధ్యమయ్యిందని తెలిపారు. బీజేపీ నాయకులు నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, జెడ్పీటీసీ సుమనరవిరెడ్డి, సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రఘునథన్ రాము, తహసీల్దార్ టివి రోజా, ఎంపిడిఓ రాములు నాయక్, రెవెన్యూ అధికారి మోహమ్మద్ వాహిద్, ఎంపిటిసి చింతల దాస్, తాటిపాముల శ్రీనివాస్ గుప్త, సీనియర్ నాయకులు పాశం కుమార్, అరటి రఘు, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు మోహన్ నాయక్, రాజు నాయక్, సర్పంచ్ రాములు నాయక్, చందర్ నాయక్, బిరిష్ శేట్టి, ఉప సర్పంచ్ రాజేశ్వర్, గిరిజనులు, తాండ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణాలకు పచ్చ జెండా..

వెంగల్ పాడ్, తిర్మన్ పల్లి గ్రామాల మధ్యలో గల రోడ్డు బ్రిడ్జి నిర్మాణం కొరకు రూ.5 కోట్ల నిధులు, లింగాపూర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు రూ.7 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వెల్లడించారు.

వంద పడకల ఆసుపత్రి మంజూరుపై మండల వాసుల హర్షం..

ధర్పల్లి : మండల కేంద్రానికి వందపడకల ఆసుపత్రి మంజూరవడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర ఆర్టీసీ చైర్మెన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో మండల ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే నివాసంలో శనివారం కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తూ మండలానికి సూపర్ స్పెషాలిటీ తరహాలో 3స్టార్ ఆసుపత్రిని మంజూరు చేశారని, ఇందుకు గాను 33 కోట్ల 40వేలపై లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. సోమవారం అధికారులు స్థల పరిశీలన చేసేందుకు రానున్నారని అన్నారు. కార్యక్రమములో జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్, ధర్పల్లి, హొన్నాజీపేట్, రామడుగు సొసైటీ చైర్మెన్లు మల్లికార్జు, రాజేందర్ రెడ్డి, రాజేందర్, మండల అధ్యక్షుడు మైపాల్ యాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు ఆర్మూర్ పెద్ద బాలరాజ్, కుర్రోళ్ళ రమేష్, సంగీత భాస్కర్, వేంకటేశ, భగవంత్ రెడ్డి, లోక్కిడి రాములు, గోర్త్మ్ మోహన్, శర్మన్, రాజ్పాల్ రెడ్డి, కిషోర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వాడి సర్పంచ్ గంగారెడ్డి, దేవేందర్ చౌహన్, సొసైటీ డైరెక్టర్లు బాలు నాయక్, గున్నయ్య శ్రీనివాస్ నాయక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతిచెందితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తూ ప్రభుత్వమే అంత్యక్రియలకు డబ్బులు మంజూరు చేయాలని అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జూన్ 6వ తారీఖున మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్నట్లు జంగం గంగాధర్ తెలిపారు. 5వ తారీఖులోగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జేఏసీ నాయకులతో చర్చలు జరిపి కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇస్తే సమ్మె చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ జేఏసీ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరుపుకుంటే ఆరవ తారీఖు నుంచి సమ్మెకు దిగుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, బిల్ కలెక్టర్‌లకు సీనియార్టీ బట్టి పదోన్నతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ ఎడపల్లి మండల ఉపాధ్యక్షులు కుంట సంతోష్, పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లిబర్టీ స్కూల్ మూసివేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని పాత ఎన్జీఓఎస్ కాలనీలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న లిబర్టీ స్కూల్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న లిబర్టీ హైస్కూల్‌ను మండల విద్యాశాఖాధికారి చేత తాత్కాలికంగా మూసివేసినట్టు వివరించారు.

పోడు భూములకు పట్టాలు పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోనీ రైతు వేదికలో స్థానిక ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పోడు రైతులకు పట్టాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములకు పట్టాలు అందజేస్తే ఒక్కో ఎకరాకు రూ.25 వేలు చొప్పున వసూలు చేసి ఉండేవారని ఆరోపించారు. వారిదంతా కమీషన్ దందా అని అన్నారు. ఎంపీ అరవింద్, అతని తండ్రి డీఎస్ ఇద్దరూ కమీషన్ దొంగలేనని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు జెడ్పిటిసి బాజీరెడ్డి జగన్మోహన్ గారు, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ గారు, విజి గంగాధర్ గౌడ్ ఎమ్మార్వోలత, ఎంపీడీవో లింగం నాయక్ స్థానిక ఎంపీపీ లతా కన్నెరాం, వైస్ ఎంపీపీ అనిత, జడ్పిటిసి కమల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయాలు

సర్కార్ బడులు..

- తరగతి గదులకు విరిగిపోయిన డోర్లు, కిటికీలు
- నీటి సౌకర్యం లేదు
- సరిపడా మరుగుదొడ్లు కరువు
- స్కావెంజర్లు లేక పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న పాఠశాలలు
- వేధిస్తోన్న ఉపాధ్యాయుల కొరత

ప్రభుత్వ పాఠశాలలు.. సమస్యలకు నిలయాలుగా మారాయి. పాఠశాలల్లో తరగతి గదులకు విరిగిపోయిన డోర్లు, కిటికీలు దర్శనమిస్తున్నాయి. చాలా స్కూళ్లలో నీటి సౌకర్యం లేదు. సరిపడా మరుగుదొడ్లు కరువయ్యాయి. ఇక స్కావెంజర్లు లేక పిచ్చి మొక్కలతో పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది.

నవతెలంగాణ-భిక్నూర్

కామారెడ్డి జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 697, ప్రాథమికోన్నత పాఠశాలలు 127, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 187 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 99,862 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి బోధించేందుకు గానూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,042 మంది ఉపాధ్యాయులున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను పరిశీలిస్తే.. నీటి సౌకర్యం ఉంటే మరుగుదొడ్లు లేకపోవడం, మరుగుదొడ్లు ఉంటే నీటి సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలే దర్శనమిస్తున్నాయి. తరగతి గదులకు కిటికీలు లేకపోవడం, డోర్లు సైతం విరిగిపోవడంతో వర్షం పడ్డప్పుడల్లా.. క్లాస్ రూమ్‌ల్లోకి వర్షం నీరు వచ్చి చేరుతుందని విద్యార్థులు చెబుతున్నారు. నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు టాయిలెట్ వెళ్లాలంటే బయట నుంచి నీళ్ల తెచ్చుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కనీసం భోజనం చేసిన తర్వాత కూడా చేతులు కడుక్కోవడానికి నీళ్ళు లేకపోవడంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులే బయట నుంచి నీరు మోసుకొని వచ్చి విద్యార్థులకు అందజేస్తున్నారు.



జంగంపల్లి ప్రాథమిక పాఠశాలలో నీటివసతి లేక పోవడంతో పక్కనే సంపులో నీటిని నిల్వ చేసిన విద్యార్థులు

మరుగుదొడ్లు ఉన్నా.. నీరు లేదు..


బాలికలకు టాయిలెట్స్ ఉన్నా.. సరిపడా లేకపోవడం, బాలురకు ఎక్కడ కూడా టాయిలెట్స్ లేకపోవడంతో బయటకు వెళ్లాల్సి వస్తుంది. భిక్నూర్ మండలంలోని మరో ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తే పాఠశాల ప్రాంగణంలో సంపును ఏర్పాటు చేసుకొని అందులో మంచినీరు నింపుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు బకెట్ల ద్వారా నీళ్ల తీసుకెళ్లి టాయిలెట్స్‌కి వెళ్తున్నారు.

ఉపాధ్యాయుల కొరతకు ఇదే నిదర్శనం..

భిక్నూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలను 'నవతెలంగాణ' పరిశీలించగా.. ఓ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాంఘిక శాస్త్రానికి సంబంధించిన ఉపాధ్యాయుడు లేకపోవడంతో సైన్స్ ఉపాధ్యాయుడు సాంఘిక శాస్త్రాన్ని బోధిస్తున్నారు. అంతంపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే విద్యను బోధిస్తున్నారు. అందులోనే ఒక ఉపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుడి బాధ్యతను నిర్వర్తిస్తూ.. అటు విద్యార్థులకు విద్య బోధన చేపడుతున్నారు. జంగంపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలలో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు లేని కారణంగా సోషల్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుడి బాధ్యతను నిర్వహిస్తున్నారు. దీనిని బట్టి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఏ విధంగా ఉందో అర్థమవుతోంది.



అంతంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల పక్కన ఏపుగా పెరిగిన పొదలు



జంగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలలో విరిగిన తరగతి గది తలుపు

స్కావెంజర్లు లేరు..

ఇక ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లు లేని కారణంగా పాఠశాల చుట్టు పక్కల పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది చేతనే పనులు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా గ్రామపంచాయతీ విధులు, గ్రామ సమస్యలు అధికంగా ఉన్న కారణంగా గ్రామపంచాయతీ సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంటుంది. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు పాఠశాల ఉపాధ్యాయులు తమ జేబుల నుంచి డబ్బులు ఇచ్చి.. స్కావెంజర్ పనులు చేయించుకుంటున్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

ప్రభుత్వ పాఠశాలలో చాలావరకు టాయిలెట్లలో నీళు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బయట నుంచి తీసుకుని వెళ్లి టాయిలెట్ వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి.

– జంగంపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ స్మైలాబ్

సమస్యలు పరిష్కరించుకుంటే ఉద్యమాలు తప్పవు

ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో చేరుకున్నాయి. ప్రతి పాఠశాల పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన గాడి తప్పుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలి. లేకుంటే ఉద్యమాలు చేస్తాం.

– పి.డి.ఎస్‌యు జిల్లా కార్యదర్శి సురేష్

వైద్యులు ప్రాణదాతలు

- ఘనంగా జాతీయ వైద్య దినోత్సవం
- పలువురు వైద్యులకు సన్మానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : (ఫొటో) వైద్యులు ప్రాణదాతలని ఎంపీపీ కే శ్రీనివాస్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఎంపీపీ కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజ్ కుమార్‌తో పాటు ఆసుపత్రి పాలనాధికారి రాములను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, 14వ వార్డ్ సభ్యులు వీణ సదానందం, మాజీ ఉపసర్పంచ్ నాయక్ అలీ, ఆసుపత్రి పాలనాధికారి రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : మెడికల్ కళాశాలలో డాక్టర్స్ డే..



ఆర్మూర్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం..

ఆర్మూర్ : పట్టణంలోని స్థానిక విద్య హైస్కూల్లో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ అధ్యక్షతన డాక్టర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ వైద్యులు రమేష్, అశోక్ శివరాజ్, చౌహాన్, స్రవంతి పూలమాల, శాలువా జ్ఞాపకతో సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిప్యూటీ డిఎంహెచ్వో రమేష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సేవలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని విద్యార్థులు అందరూ భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలవాలని వారు సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సెక్రెటరీ పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, ప్రాజెక్ట్ చైర్మన్ ప్రవీణ్ పవార్, పుష్కరావు, రజనిష్ కిరాడ్, గోనే శ్రీధర్, సత్యనారాయణ ఖాందేశ్, వినాయక్, ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ,చార్టెడ్ అకౌంటేడ్ దినాన్ని పురస్కరించుకొని ప్రముఖ డాక్టర్లకు, చార్టెడ్ అకౌంటెంట్‌లకు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసినట్టు అధ్యక్షులు గుజరాతీ ప్రకాష్ తెలిపారు.

లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులకు వైద్యుల సేవలపై అవగాహన.. (ఫొటో)

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులకు డాక్టర్స్ డే సందర్భంగా వైద్యుల సేవలపై వివరించినట్టు పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రధానోపధ్యాయులు దాస్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాలరాజ్ మెమోరియల్ హాస్పిటల్ వైద్యులు రాకేష్, ఝాన్సీ, హోమియో కేర్ హాస్పిటల్ చిలుక శ్రీనివాస్, ఎల్‌కే హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అశోక్, గ్లోబల్ ఐ కేర్ వైద్యులను సన్మానించారు.

డాక్టర్ ప్రతిమారాజ్‌కు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్

నవీపేట్ : డాక్టర్స్ డే సందర్భంగా నిజామాబాద్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్‌కు యంచ సర్పంచ్ లహరి ప్రవీణ్ శనివారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ లహరి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డాక్టర్ ప్రతిమ రాజ్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు.



ఆర్మూర్ : లిల్లీపుట్‌లో..



ఎడపల్లిలో..

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



ధర్పల్లి : పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ధర్పల్లి : సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణానికి చెందిన బొబ్బిలి లత, బొబ్బిలి అక్షయ్, బొబ్బిలి రిషి అనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను శనివారం అందజేసినట్టు ఫౌండేషన్ సభ్యులు ప్రభాస్ తెలిపారు. చదువుకోవాలనే ఆసక్తి ఉండి.. పుస్తకాలు కొనుక్కోలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థులు తమ ఫౌండేషన్‌కు సమాచారం అందిస్తే వారికి తమ వంతు సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బన్నీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

వేల్పూర్ : మండలంలోని జాన్కంపేట్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక గ్రామ సచివాలయ కారోబార్ ఆగ్గు వంశీ ఆయన పుట్టిన రోజు సందర్భంగా శనివారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. సుమారు 3వేల రూపాయల విలువ గల నోట్ పుస్తకాలను విద్యార్థులకు స్థానిక సర్పంచ్ సొడ ప్రేమలత, ఉపసర్పంచ్ రమేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామ సచివాలయ కార్యదర్శి మౌనిక, ప్రధానోపాధ్యాయులు శ్రావణి, పచ్చులనక్కుడ ప్రధానోపాధ్యాయులు నరేష్, ఎంపీటీసీ సొడ చందన్ తదితరుల పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ

వర్ని(మోస్రా) : మండలంలోని గోవూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు తన తండ్రి యలవర్తి జయరామారావు జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.16 వేల ఫార్మేటివ్ పరీక్షల నోట్ బుక్కులను శనివారం 101 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం తన తండ్రి జ్ఞాపకార్థం సంపాదనలో కొంత విద్యార్థులకు వెచ్చిస్తానని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు ఆలోచన విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పాఠశాల చైర్మన్ నన్నేసాబ్ కొనియాడారు. లయన్స్ క్లబ్ నిజామాబాద్ గవర్నర్ లక్ష్మి మాట్లాడుతూ.. బతికున్నప్పుడు తల్లిదండ్రులకు తిండి పెట్టేవాళ్ల ఉన్నారో లేదో కానీ చనిపోయిన తర్వాత కూడా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవ చేసే గొప్ప వ్యక్తి రవీంద్రబాబు పాఠశాలలో ఉండడం అదృష్టంగా భావించాలన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలే బుద్ధి చెప్తారు

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్‌కు నియోజకవర్గ ప్రజలే బుద్ధిచెప్తారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి తమ నాయకుడైన ఏలేటి మల్లికార్జున్‌రెడ్డికి సవాల్ విసిరిన విషయం ప్రస్తావించారు. కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు ముస్కు నర్సయ్య, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాగర్ తదితరులు పాల్గొనారు.

ప్రశాంతంగా గ్రూప్ 4 పరీక్ష

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలో 6 కేంద్రాలలో గ్రూప్ 4 పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంపిడిఓ గోపి బాబు తెలిపారు. మొత్తం అభ్యర్థులు 1944 గాను 376 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- పలువురికి గాయాలు

నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ముప్కాల్ ఎస్ఐ భాస్కరా చారి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం వేకువజామున బొలేరో వాహనం లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో 9 మందికి గాయాలయ్యాయి. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గొట్టి పార్థి రాజ్ (36) మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మిగతా క్షతగాత్రులు ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

గిరిజన పుత్రుడు త్రిపుల్ ఐటీకి ఎంపిక


మాలోత్ రాజేందర్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారం తండాకు చెందిన గిరిజన పుత్రుడు మాలోత్ రాజేందర్ నాగ్‌పూర్ త్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు తండా వాసులు తెలిపారు. మలోత్ రేణుక-పరుశరాం కుమారుడు. ఈయన తండ్రి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూనే కుమారుడిని చదివిస్తున్నాడు. గాంధారి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇంటర్ వరకు విద్యను అభ్యసించినట్లు తెలిపారు. ఈయన ఐ.ఐ.ఐ.టి నాగ్ పూర్ సీటు సంపాదించిన ట్లు తెలిపారు. దీంతో విద్యార్థిని స్థానిక తండావాసులు అభినందిస్తున్నారు.

నాయీబ్రాహ్మణ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో శనివారం నాయి బ్రాహ్మణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిన్న సంగయ్య, ఉపాధ్యక్షులుగా గంగారం, సెక్రటరీగా మహేష్, క్యాషియర్‌గా భాస్కర్, సలహాదారులుగా బాలరాజు, రాజయ్య, అశోకులను ఏకాగ్రంగా ఎన్నుకున్నారు.


ఎన్నికైన నూతన కమిటీ

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వినతి


ప్రొఫెసర్ ఆర్ లింబాద్రికి గారికి వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు తెలంగాణ ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ రెగ్యులరైజ్ పక్రియ చేయడంపై తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యక్షులు డాక్టర్ పరశురాం, యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఫస్ట్ ప్రొఫెసర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ నారాయణ గుప్తా, తెలంగాణ విశ్వవిద్యాలయ అధ్యక్షులు డాక్టర్ దత్త హరి, డాక్టర్ శరత్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ కిరణ్ రాథోడ్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ,ఆర్ఎంపీల సేవలు మరువలేనివి

నవతెలంగాణ-తాడ్వాయి

గ్రామాలలో పిఎంపి, ఆర్ఎంపీలు చేస్తున్న సేవలు మరువలేనివని పి.ఎం.పి, ఆర్ఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు పోలీస్ రాజేశ్వరరావు తెలిపారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామంలో శనివారం డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాత్రి అనక పగలు అనక పిఎంపీ, ఆర్ఎంపీలు విశేషమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. పీఎంపీ, ఆర్ఎంపీ సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రతి వైద్యుడు ఎంతో కష్టపడి ప్రజలకు సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ ఆర్.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కామారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి రాజయ్య ప్రతినిధి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సోయా దొంగల అరెస్ట్

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని సిర్ సముందర్ గ్రామానికి చెందిన రైతు రవెళ్ళ రవికుమార్ తన చేనులో పండించిన సోయా పంటను ఎక్కువ ధరకు వచ్చినప్పుడు అమ్ముకుందామని తన ఇంటి ముందర సోయా సంచులు భద్రపరచుకొని ఉంచగా చోరీకి గురైయ్యాయి. హస్గుల్ గ్రామానికి చెందిన తుత్తూరు లింగురాం, బిచ్కుంద గ్రామానికి చెందిన మచ్కురు విజయ్ ఇద్దరు కలిసి ప్రతిరోజు సోయా సంచులు దొంగతనం చేసి బైక్ పై తరలిస్తూ వివిధ ప్రాంతాల్లో విక్రయాలు చేశారు. సోయా సంచులు పోయినట్లు గమనించిన రైతు రవికుమార్ జూన్ 28వ తేదీన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, రైతు రవికుమార్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల్లో దొంగతనం దృశ్యాలు రికార్డు కావడంతో దాని ఆధారంగా దొంగలను అరెస్టు చేశారు. బైక్‌తో పాటు కొన్ని సోయా బస్తాలు రికవరీ చేసి లింగురాం, విజయల పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి శనివారం జైలుకు పంపినట్టు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. రైతులు తాము పండించిన పంటల సంచులను భద్రపరిచేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటి ఆవరణలో వీధులలో సిసి కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా ఎస్సై రైతులకు, ప్రజలకు సూచించారు.

ముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


ముఖ్యమంత్రికి పటనికి పాలభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మండలం లోని అమీర్‌నగర్ గ్రామ పరిధిలోని బిల్యా నాయక్ తండాలో గిరిజనులు శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గిరిజనులకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలావత్ ప్రకాష్ మాట్లాడుతూ గిరిజనులకు పోడు భూములకు పట్టాలు అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిలకు మండల గిరిజనుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సలాం..

- ఘనంగా డాక్టర్స్ డే..
- పలువురి వైద్యులకు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

డాక్టర్స్ డే పురస్కరించుకొని పలుచోట్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను సన్మానించారు.

జుక్కల్ మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో వైద్యఆరోగ్య శాఖ వైద్యులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా, మండల శాఖ చైర్మన్ సభ్యులు సన్మానించారు. జిల్లా సభుడు దస్తీరాం, మండల చైర్మన్ దొంగ్లె ఉమాకాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో శైలేష్, శివప్పా, అమూల్, హెల్త్ సూపర్ వైజర్ యోగేశ్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

లింగంపేట్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లింగంపేట్ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సీనియర్ డాక్టర్ హిమబిందు అదేవిధంగా సమాజ సేవకుడు పేద ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించే డాక్టర్ అజయ్ రెడ్డిని శాలువా కప్పి సన్మానించినట్టు రెడ్ క్రాస్ మండల అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాల సంరక్షణకు అలుపెరగకుండా కృషిచేస్తూ, కోవిడ్ మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వైద్యసేవలను అందించి

ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడి, వైద్యో నారాయణో హరి అనే నానుడికి నిలువెత్తు నిదర్శంగా వైద్యులు నిలుస్తున్నారని అన్నారు. వారి కృషిని డాక్టర్స్ డే రోజు గుర్తు చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు రాయని అశోక్, సునీల్, అభినవ్, లక్ష్మణ్, సాయిలు, సూపర్‌వైజర్ మరియమ్మ పాల్గొన్నారు.


ఎల్లారెడ్డి ఆస్పత్రిలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు


లింగంపేట్‌లో వైద్యులకు సన్మానం

ఎల్లారెడ్డి ఆస్పత్రిలో ఘనంగా డాక్టర్స్ డే

ఎల్లారెడ్డి: స్థానిక ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఘనంగా డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సుపెరడెంట్ రవీంద్ర మోహన్‌ని వైద్య సిబ్బంది శాలువతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. ఇమ్రాన్ సల్మాన్, డా. నిశాత్ నజరీన్, ఆసుపత్రి సిబ్బంది హెడ్ సిస్టర్ రేణుక దేవి, విజయ లత, కరుణ,సుగంధ, స్వరూప, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.


రామారెడ్డిలో పీహెచ్‌సీ వైద్యులకు సన్మానిస్తున్న పలువురు

పీహెచ్‌సీ వైద్యులకు సన్మానం

రామారెడ్డి: అంతర్జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా శనివారం రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సురేష్, ఆయుష్ వైద్యాధికారి చైతన్య లను వైద్య సిబ్బంది శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించడమే వైద్యుల బాధ్యత, లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భీమ్, స్వాతి, శ్రీహరి, దోమల శ్రీధర్, పవన్, మహేశ్వరి, రజిత, రమ్య, జ్యోతి, లలిత, లింబమ్మ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో భరోసా

- సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

పలువురు లబ్దిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను విప్ గంపగోవర్ధన్ శనివారం కామారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలోని 45 మందికి 19 లక్షల 45 వేల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం బి అర్ ఎస్ పార్టీ బీమా చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2017 మందికి 12కోట్ల 50 లక్షల 50 వేల 700 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇప్పించినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి తో పాటు పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచించి ప్రమాద బీమా చేయించారని అన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో ఖర్చయినా డబ్బులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇప్పిస్తామని అన్నారు. ఆసుపత్రి నుండి వచ్చిన తర్వాత సంబంధిత పత్రాలను తమ కార్యాలయంలో ఇస్తే వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు.


వెంకటేష్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్న గంప గోవర్ధన్


తాడ్వాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

భిక్కనూర్: మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ గతంలో యాక్సిడెంట్ కావడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయింది. మరోసారి యాక్సిడెంట్ కావడంతో సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకున్న తరువాత ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు ట్రైన్ యాక్సిడెంట్ లో మరణించాడు. అతనికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఒక లక్ష 7000 రూపాయల చెక్కును వెంకటేష్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుమోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్ రెడ్డి, నాయకులు రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

భిక్కనూర్: మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తికి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా అతనికి మంజూరైన 28 వేల రూపాయల చెక్కును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రాజా గౌడ్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు సాయ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత


కులసంఘాల వారికి ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న విప్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట, అన్నారం, వివిధ కుల సంఘాల కమ్యూనిటీ హాలకు శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పోస్టింగ్ కాపీలను, స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో, కుల పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ... కుల మతాలకతీతంగా, ఆయా కులస్తులు ప్రతినెల కుల సంఘ సమావేశం నిర్వహించుకునేందుకు, పండగలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడతా యని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ దశరథ్ రెడ్డి మాట్లాడుతూ... మండలంలోని కామారెడ్డి నియోజకవర్గ గ్రామాల్లోని వివిధ కుల సంఘాలకు రూ 31 లక్షలతో పోస్టింగ్ అందజేసినందుకు గంప గోవర్ధన్ కు కుల సంఘాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కుల పెద్దలు గంప గోవర్ధన్ కు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బొమ్మిడి రామ్ రెడ్డి, అన్నారం సర్పంచ్ అమృత బాలరాజ్, బి ఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, ఉప సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్, బి ఆర్ ఎస్ మండల యూత్ అధ్యక్షులు గడ్డం చిన్న రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బండి నర్సవ్వ, నాయకులు వడ్ల లక్ష్మయ్య, గజ్జల శంకర్, తోట గంగయ్య, పాలకవర్గ సభ్యులు, ఆయా కుల సంఘాల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- జాతీయ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, గురుకులపాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా బిసి యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ధనిక రాష్ట్రం అని చెప్పుకునే తెలంగాణలో బడుగు బలహీన వర్గాల,పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ 4 వేలకోట్ల బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటని, గురుకుల సొసైటీకి ఐఏఎస్ నియమించకుండా కాలయాపన చేస్తు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా కూడా గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు లేకుండా, మె స్ చార్జీలు పెంచకుండా నాణ్యతలేని భోజనాన్ని అందిస్తూ విద్యార్థులకువిద్య , భోజన సౌకర్యాలను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. జిల్లాలోని ఓపెన్ టెన్త్ అక్రమాలపై విచారణ జరిపించాలని లేనిపక్షంలో ప్రజాప్రతినిధులు ,అధికారుల ఇండ్ల ముట్టడికి వెనుకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్ రావు, రామారెడ్డి మండల యూత్ అధ్యక్షులు ఇర్ఫాన్, తాడ్వాయి మండల యూత్ ప్రధాన కార్యదర్శి అడేపు ప్రవీణ్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి రాజేందర్, కామారెడ్డి టౌన్ యూత్ నాయకులు అభిలాష్, భాను, ప్రశాంత్ పాల్గొన్నారు.


వినతి పత్రన్ని అందజేస్తున బిసి యువజన సంఘ నాయకులు

ఆధార్‌లో తప్పులుంటే సరి చేసుకోవాలి


తపాల కార్యాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఆధార్ వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే వాటిని సరి చేసుకోవచ్చని లింగంపేట్ తపాల శాఖ అధికారి అంబర్ సింగ్ గ్రామస్తులకు సూచించారు. లింగంపేట మండలంలోని పోతాయపల్లి గ్రామంలో శనివారం తపాల శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని తపాల శాఖ కార్యాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలను ఇబ్బందులు గురికాకుండా ఆధార్ వివరాల్లో ఏదైనా తప్పులుంటే వాటికి సంబంధించి సరి చేసుకోవడానికి తపాలా శాఖ శిబిరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిగ్రామంలో శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐపీఓ శ్రావణ్ కుమార్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, యుఐ వెంకటరామిరెడ్డి, బీపీఎమ్‌లు లింగం, నితిన్ రెడ్డి, రమ్య, రోషన్, మారుతి, వినోద్, మనిషా, టెక్నికల్ సిబ్బంది అరుణ్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాల.. ఫక్తు బిజినెస్

- వ్యాపారంగా మారిన విద్య..
- ఫీజులతో పాటు యూనిఫాం, పుస్తకాల విక్రయాలతో నిలువు దోపిడీ

నవతెలంగాణ-బోధన్

ప్రైవేట్ పాఠశాలలో సామాన్య ప్రజల పిల్లలకు చదువు అందని ద్రాక్షలా మారింది. పలు ప్రైయివేట్ పాఠశాలలు వారి పాఠశాలలో నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్, యూనిఫామ్స్ విక్రయిస్తు పాఠశాలలను ఫక్తు వ్యాపార కేంద్రంగా మార్చాయి. దీనికి నిదర్శనమే సాలూర మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాల. ప్రాథమికోన్నత స్థాయిలో నిర్వహించే ఈ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ పాఠశాలలో నోట్ పుస్తకాలు, పుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థుల వద్ద వేల రూపాయలు దండుకుంటున్నారు. అంతేకాకుండా టై, బెల్ట్, యూనిఫారంలు విద్యార్థులకు అంటగడుతూ సామాన్య ప్రజల వద్ద వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, ఇతర వస్తువులు, యూనిఫారంలు ఇక్కడే కొనుగోలు చేయాలని డిమాండ్ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పడం లేదు. 5వ తరగతి చదివే విద్యార్థికి పాఠశాల ఫీజు 11000/- రూపాయలయితే పుస్తకాలు టై,బెల్ట్, పరీక్ష ఫీజులు అంటు అదనంగా 2000/- రూపాయలకు పైగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంకా యూనిఫాంలకు అదనపు వసూళ్లు. పేరుకే ప్రైవెట్ పాఠశాలలు కాని పక్క కమర్షియల్ వ్యాపారంగా పాఠశాలలను మార్చారు. ప్రైవెట్ పాఠశాలల యాజమాన్యలు ఫీజులు భారీగా పెంచేయడంతో ఫీజుల నియంత్రణ లేక ప్రైవెట్ పాఠశాలల యాజమాన్యలు ఎవరికి వారే అడ్డగోలుగా దోచుకుంటున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. నేటి పరిస్థితులలో ప్రైవెట్ పాఠశాలలో సామాన్యుల పిల్లలకు చదువులు అందని ద్రాక్షలా మారాయి. ప్రయివేట్ పాఠశాలలో నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్, యూనిఫామ్స్ విక్రయించవద్దని ప్రభుత్వం నిబంధనలు విధించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యలు మాత్రం పట్టించుకోవడం లేదు. బయట మార్కెట్ ధరల కంటే ప్రయివేటు పాఠశాలలో రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారని పిల్లల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న సదరు ప్రయివేటు విద్యాలయంలో కనీస సౌకర్యాలు లేవని పలువురు ఆరోపించారు. పుస్తకాలు, టై, బెల్ట్, యూనిఫారంలా పేరుతో అధిక ధరలకు విక్రయిస్తూ వేల రూపాయలు వసూలు చేస్తున్న పాఠశాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు చట్టరీత్య చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


ప్రైవేట్ బడిలో పుస్తాకల దందా

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు

ఎంఈఓ నాగనాథ్ , బోధన్.

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రయివేటు పాఠశాలలపై చట్టరీత్య చర్యలు చేపడతాం. ప్రయివేటు పాఠశాలలో ఎలాంటి వస్తువులు విక్రయించరాదు. నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలు నడపాలి. లేని ఎడల ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చట్టరీత్య చర్యలు చేపడతాం.

కొండెక్కిన టమాట ధర

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


టమాట కొనుగోలు చేస్తున్న మహిళ

టమాట ధర కొండెక్కింది. శనివారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని సంతలో టమాట ధర కిలో రూ.90 పలికింది. గత వారం సంతలో కిలో రూ.50కే వ్యాపారులు విక్రయించగా.. శనివారం మాత్రం కిలో టమాట రూ.90కి విక్రయించారు. టమాట ఇతర ప్రాంతాల నుంచి రావడంతో ధర పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

బాలుర వసతిగృహంలో సీట్ల భర్తీకి ఆహ్వానం

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ, బాలుర వసతిగృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు ఎటువంటి రాతపరీక్ష లేకుండానే నేరుగా వసతి గృహంలో ప్రవేశం కలదని, వసతి గృహం నుంచి పాఠశాల వరకు ఆటో సౌకర్యం కల్పించబడుతుందని వార్డెన్ సాయి కుమార్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహంలో చేరబోయే విద్యార్థులు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫోటోలు 4, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులతో వసతి గృహంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 7997802943, 9493927414 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-మోర్తాడ్

మోర్తాడ్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తీగల సంతోష్ మంత్రి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. సంతోష్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు మంత్రి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేకే బీజేపీ, కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నప్పటికీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్‌తో ఆర్థిక భరోసా

- 5వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి రవికుమార్

నవతెలంగాణ-బోధన్

సమాజంలోని ప్రతి ఒక్కరూ పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న ప్రమాద బీమా ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దానితో కార్మిక, కర్షక కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని 5వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి రవికుమార్ అన్నారు. శనివారం బోధన్ కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ - తపాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టల్ ఇన్సూరెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక, న్యాయ సిబ్బందికి పోస్టల్ ఇన్సూరెన్స్‌పై అవగాహన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్ బీమా పథకం ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు. సంవత్సరానికి కేవలం 399 రూపాయలు చెల్లిస్తే 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ బీమాను చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి రూబీన ఫాతిమా, తపాల శాఖ ఇన్‌స్పెక్టర్ గజ్జల వేణు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య, సీనియర్ న్యాయవాది ఆబిద్ అహ్మద్, హనుమంతరావు, భవన నిర్మాణ కార్మికులు, న్యాయ సేవ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 5వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి

ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో గ్రూప్ 4 అభ్యర్థుల కోసం సహాయ కేంద్రం


సహాయ కేంద్రం వద్ద వివరాలు తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

గ్రూప్ 4పరీక్షల కోసం పలు గ్రామాల నుంచి బోధన్ పట్టణానికి వచ్చిన అభ్యర్థుల సౌకర్యార్థం బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ బోధన్ బస్టాండ్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా అభ్యర్థులు వారి పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరేలా వాహన సౌకర్యం కల్పించారు. ఈ సహాయ కేంద్రంలో మారుతీ మందిర్ మాజీ చైర్మన్ నాగన్ పల్లి మధు, సిరివెసు సంతోష్, కార్మిక విభాగం అధ్యక్షులు రవిశంకర్ గౌడ్, విద్యార్థి విభాగం అధ్యక్షులు వడ్ల సతీష్ చారి, నాయకులు శ్రీనివాస్, హరిశంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన పట్టణం..

గ్రూప్ 4 పరీక్షల కోసం బోధన్ పట్టణంలో సుమారు 20 వరకు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పలు ప్రాంతాల నుంచి పరీక్షలు రాయడానికి అభ్యర్థులు తరలివచ్చారు. దాంతో బోధన్ పట్టణంలో వాహనాల రద్దీతో కిటికిటలాడింది. పరీక్ష కేంద్రాల వద్ద రద్దీ కనబడింది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అభ్యర్థులతో బస్టాండు రద్దీగా మారింది. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ, ఎస్టీ, బీసీ పెండింగ్‌లో ఉన్న రూ.5000 కోట్లు స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు నవాతే ప్రతాప్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నవతే ప్రతాప్ మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను 200ల కోట్లకు పెంచాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని, బీసీబంధును ప్రవేశపెట్టాలన్నారు. బీసీ కులాలకు ఇచ్చే లక్ష రూపాయల పథకాన్ని అన్ని కులాలకు వర్తింపజేసేలా జీవో జారీ చేయాలని, లేని పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గంగోలి రమేష్, వెంకట్ యాదవ్, నరేష్, శ్రీకాంత్, శివ కేశవ్, మహిళా అధికార ప్రతినిధి సరిత, చింటూ ప్రసాద్, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-ఎడపల్లి

లయన్స్ క్లబ్ ఎడపల్లి ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ వాగ్దేవి పాఠశాలలో పీఎంపీ వైద్యులను క్లబ్ ప్రతినిధులు సన్మానించి జ్ఞాపకలను అందచేశారు. ఎడపల్లి, తానాకలాన్ గ్రామాలకు చెందిన పి.ఎం.పి వైద్యులు బాలరాజ్ శ్రీనివాసులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. ఎడపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పలకలను పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తినుబండారాలను అందజేశారు. పదవ తరగతిలో టాపర్‌గా నిలిచిన గ్రామానికి చెందిన రంజితను లయన్స్ క్లబ్ ప్రతినిధులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. వాగ్దేవి పాఠశాలలో చిత్రలేఖనంలో ప్రతిభ కనబరిచిన బాలికలకు సన్మానించారు. డయాబెటిక్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మెర్సి, కార్యదర్శి కదం ప్రకాష్‌రావు, కోశాధికారి బంజశంకర్, ప్రతినిధులు గంగారెడ్డి, కాశీనాథ్, మనోజ్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు ఏకే తులసి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.


వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

అప్పుల కుప్పగా రాష్ట్రం

- టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్
- ఖమ్మం తెలంగాణ జన గర్జన సభ విజయవంతం చేయాలని పిలుపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా, వ్యవస్థలన్నీ సర్వనాశనం చేస్తూ దోపిడీ, అవినీతి ప్రభుత్వంగా తయారు చేసిన చరిత్ర కేసీఆర్ దేనని టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ అన్నారు. విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశారని, రాష్ట్రాన్ని లీకుల, లిక్కర్ ప్రభుత్వంగా తయారు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరగబోయే తెలంగాణ జన గర్జన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఉద్దేశించి వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. సీఎల్పీ నాయకులు బట్టి విక్రమార్క పాదయాత్ర నేటితో ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా దాదాపు 1360 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టిన బట్టి విక్రమార్క ముగింపు సభకు ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ముఖ్యఅతిథిగా వస్తున్నారని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు పెరుగుతున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక రాహుల్ గాంధీ సభను విఫలం చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా సభను విజయవంతం చేస్తామని అన్నారు. కేసీఆర్ పాలన అంతం చేయడానికి ఎంతో మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమవుతున్నారన్నారు. నిత్యం ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి అవసరమైతే గొంగడి పురుగునైన అలుముకుంటామని స్పష్టం చేశారు. అనంతరం టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియామకమైన సందర్భంగా కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేణుగోపాల్ యాదవ్‌ను కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుంకెట రవి, నిమ్మ రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి తక్కురి దేవేందర్, బుచ్చి మల్లయ్య, బద్దం రాజేశ్వర్‌రెడ్డి, కిషన్ కేత్ మండలాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, చింతకుంట శ్రీనివాస్, గోపిడి లింగారెడ్డి, సుంకెట శ్రీనివాస్, పడాల మల్లేష్, కొమ్ముల రవీందర్, పత్రి రవి, ఏనుగు రాజేశ్వర్, సల్లూరి గణేష్, వన్నెల రాజేశ్వర్, వేములవాడ జగదీష్, తక్కూరి శేఖర్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేణుగోపాల్

రోటరీ అంతర్జాతీయ నూతన కార్యవర్గం ప్రారంభం


నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోటరీ అంతర్జాతీయ నూతన కార్యవర్గం 2023-24 ప్రతి ఏడాది లాగే జులై 1వ తేదీన ప్రారంభమవుతుందని డాక్టర్స్ డే చార్టెడ్ అకౌంటెంట్స్ డే కార్యక్రమం నిర్వహిస్తూ ప్రారంభించినట్టు రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఇంచార్జ్ అధ్యక్షులు బి.విజయ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ మాజీ అధ్యక్షులు, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ పి.బి కృష్ణమూర్తి హాజరై మాట్లాడుతూ.. నేటి ఆధునిక జీవనంలో ఆరోగ్యంపై శ్రద్ధ అనేది కనుమరుగవుతుందని ఆరోగ్యం బాగుంటేనే అన్ని రకాలుగా మనిషి బాగుంటాడని తెలిపారు. తదనంతరం క్లబ్ ఆధ్వర్యంలో సమాజానికి నిరంతరాయంగా ఎన్నో ఏండ్లుగా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులైన డాక్టర్ రామ్మోహన్‌రావు,డాక్టర్ జైనీనేహ్రు దంపతులకు, అలాగే డాక్టర్ రాజశేఖర్‌రావు, డాక్టర్ దేవకి దేవి దంపతులకు, వీరితోపాటు చార్టెడ్ అకౌంటెంట్స్ అయిన సీఏలు యాదగిరి, శ్రీపాద ఫణి చక్రవర్తిలకు మెమెంటో శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమారి, క్లబ్ సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాబురావు, కార్యనిర్వహణ అధికారి సీఏ శ్రీకాంత్ జవహర్, కోశాధికారి ఇందూరి శ్రీనివాస్, పవన్ పాండే, భరత్ పటేల్, జుగల్ జాజు, క్లబ్ మాజీ అధ్యక్షులు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తీర్మానాలు.. చేరికలు


తీర్మాన కాపీని అందజేస్తున్న ఒడ్డెరులు

నవతెలంగాణ-నంది పేట్

పట్టణనికి చెందిన ఒడ్డెర కుల సంఘం సభ్యులు స్వచ్ఛందంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో శనివారం చేరారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి నియోజకవర్గంలో తమ ఒడ్డెర జాతిని ఎంతో అభివృద్ధి పర్చాడని దీంతోపాటు అనేక నిధులు తమకు మంజూరు చేశాడని వారు తెలిపారు. దీంతో వచ్చే ఎన్నికల్లో మొత్తం తమ ఒడ్డెర ప్రజలు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వైపు ఉంటామని, కారు గుర్తుకు ఓటు వేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసి తీర్మానం కాపీని మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్‌కు అందజేశారు. అనంతరం సంఘం సభ్యులకు గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్రం యమునా ముత్యం, సీనియర్ నాయకులు ఉల్లి శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు భాస్కర్, వార్డు మెంబరు భూమేష్, దర్పాడి అశోక్, గంధం రాజశేఖర్, యువజన విభాగం నాయకులు మంతెన శ్రీకాంత్, స్వామి, రవి, శేఖర్, లక్ష్మణ్, కుల సంఘ పెద్ద మనుషులు గంగాధర్, రాజన్న, కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలకూ సమప్రాధాన్యత

నవతెలంగాణ-బాల్కొండ (కమ్మర్‌పల్లి)

బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామంలో శనివారం రూ.ఐదు లక్షలతో చేపడుతున్న ఎస్సీ సంఘ భవనానికి సర్పంచ్ నోముల రవి, మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని, మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎస్సీ మాదిగ సంఘ భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయించారని వారు తెలిపారు. సంఘ భవన నిర్మాణానికి కృషి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డికి బోదేపల్లి గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో లింగాగౌడ్, దాసరి వెంకటేష్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, ఉపసర్పంచ్ కోట మురళీ, గ్రామ శాఖ అధ్యక్షుడు నోముల మోహన్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్, రైతు బంధు మండల కోఆర్డినేటర్ నాగులపల్లి రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు నార్ల రాజు, మంద్దికుంట శ్రీకాంత్, కొట్టాల భూమరవ్, సంఘ పెద్దలు మోర్తాడ్ సాయన్న, మోర్తాడ్ లక్ష్మన్, మోర్తాడ్ పోషన్న, మోర్తాడ్ గంగన్న, మోర్తాడ్ రాజేశ్వర్, యువ నాయకులు నర్సయ్య, మోర్తాడ్ అన్వేష్, మోర్తాడ్ ప్రేమ్ కుమార్, మోర్తాడ్ సాయిరాం, మోర్తాడ్ గోపి, తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న సర్పంచ్

లింక్ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నంది పేట్

మండలంలోని అన్నారం గ్రామంలో లింక్ రోడ్డు పనులను స్థానిక నాయకులు, ఎంపీడీవో నాగవర్ధన్ ఉపాధిహామీలో భాగంగా శనివారం గొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ ఉపాధిహామీ కింద ప్రజలకు పనిదినాలు కల్పించి అన్నారం శ్మశాన వాటిక నుంచి నూత్‌పల్లి రోడ్డు వరకు, తోకల రవి తోట నుంచి ముత్యాలమ్మ గుడి వరకు ఆరు కిలోమీటర్ల దూరం ఉండేలా మట్టి రోడ్డు పనులు ప్రారంభించమన్నారు. స్వచ్ఛందంగా రైతులు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ లింక్ రోడ్లతో ఆయా గ్రామప్రజలు, రైతులు వారి వారి పంటపొలాలకు సులువుగా వెల్లచ్చున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోషన్న, ఉప సర్పంచ్ లావణ్య, వార్డు సభ్యులు లక్ష్మణ్, గొల్ల మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు నక్కల భూమేష్, వీడీసీ సభ్యులు వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలంగాణ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం నూతనంగా ఎన్నికైన సిరికొండ గ్రామ కమిటీ చైర్మన్ సంతోష్‌తో పాటు కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలవడంతో పాటు, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సిరికొండ గ్రామ కమిటీ సభ్యులు గ్రామంలో పలు అభివృద్ధి పనులపై చర్చించి, నిధుల మంజూరుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరడంతో, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ గ్రామంలో 3 స్మశాన వాటికల కొరకు, పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు, బాజిరెడ్డి జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విజీ గౌడ్, సిరికొండ గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ బాదాల సంతోష్, వైస్ చైర్మన్ ఆకు గంగారం, క్యాషియర్ సూరినీడ (మేదరి) గోపి, రైటర్ వాల్గోట్ ప్రవీణ్, సలహాదారులు చేపూరి రాజేందర్‌గౌడ్, అల్లిపురం లింగం, సభ్యులు చిట్యాల శ్రీధర్, ఆవుసుల శ్రీనివాస్, పారి పెల్లి శివారెడ్డి, ధర్మపురి చింటూ, కుమ్మరి గంగాధర్, గ్యామ సురేష్, కురుమ మధు, గురుడు శ్రీనివాస్, తదితరులున్నారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేత

గోసంగిలకు దళిత బంధు ఇవ్వాలి

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

గోసంగికి చెందిన దళితులకు 'దళిత బంధు' ఇవ్వాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం బుడగ జంగాలు మోస్రా తహసీల్దార్ సాయిలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంలో గోసంగిలను విస్మరించడం బాధాకరమన్నారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రెండో దఫా దళిత బంధు పంపిణీలో కచ్చితంగా గోసంగిలకు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, గోసంగి సంఘం నాయకులు మిరియాల వీరప్ప, చిత్తారి లాలు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పోలీసు, ఎక్సైజ్ ఆఫీసర్లకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మి నర్సయ్య ఆదేశాల మేరకు నిజామాబాద్ డివిజన్ పోలీస్ అధికారులకు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌లకు శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. కేసుల పంచనామా, చార్జిషీట్, రిమాండ్ రిపోర్టులు తయారు చేసే విధానంపై నిజామాబాద్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేష్‌గౌడ్, ఎం.డి.రహీమొద్దీన్ వివరించారు. నేరస్తులకు శిక్షణ పడేట్లు విచారణ సేకరించి కోర్టులో సరియైన విధంగా దాఖలు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రవిరాజ్, కవితరెడ్డి, కోర్ట్ లైజన్ ఆఫీసర్ శ్యాం సుందర్, ఎక్సైజ్ ఆఫీసర్ సింధు, టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్ గంగాధర్, కోర్టు ఆఫీసర్లు సాయిశ్యాం, సందీప్ పాల్గొన్నారు.

పోరాట ఫలితమే 'పోడు' పట్టాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కమ్యూనిస్టుల పోరాట ఫలితమే పోడు భూముల పంపిణీ అని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శనివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇచ్చారని తెలిపారు. గిరిజనులే కాకుండా గిరిజనేతరులు కూడా పోడు భూములలో ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని భూమిని సాగు చేస్తున్నటువంటి వారికి ప్రభుత్వం వెంటనే పోడు భూముల పట్టాలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. నాయకులు బి రఘురాం, పి హనుమాన్లు, కే గంగాధర్ పాల్గొన్నారు.